వన భోజనాలు.. ఆటల పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి

జీడిమెట్ల: జీడిమెట్ల ఎస్.ఆర్.నాయక్‌నగర్, జనప్రియ, మోడీ అపార్ట్‌మెంట్ రెడ్డీల ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజనాలు, ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో అందరికి సమానత్వం అనే నినాదాన్ని నిజం చేయాలని, దీనికి ప్రభుత్వాలు పాటుపడాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవగారి శాంతిశ్రీ రాజేందర్‌రెడ్డి, 130 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ఫ్లోరా పరిశ్రమ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రాజారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: గ్రూపు–3 పరీక్షల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా అధికారులు గ్రూపు–3 పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు.

టీఎన్‌జీవోస్ హాస్టల్ ఫోరం అధ్యక్షుడి నియామకం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా టీఎన్‌జీవోస్ హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడిగా ఎం.మాణిక్యం, కార్యదర్శిగా కె.కమల్ దాసు ఎన్నికయ్యారు. ఫోరం ఎన్నికలు కలెక్టరేట్‌లోని మినీ సమావేశంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్ హాజరయ్యారు. ఈ కొత్త కమిటీ మూడేళ్ల వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ వివరించారు. నూతన ఫోరం కమిటీలో కోశాధికారిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా నరసింహ, జాయింట్ సెక్రటరీగా జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాఘవేంద్ర, ప్రచార కార్యదర్శిగా శ్రవణ్, ఈసీ సభ్యులుగా శ్రీనివాస్, వెంకటలక్ష్మిలు ఎన్నికయ్యారు.

వృత్తి విద్యా కోర్సులు..

యువతకు ఉపాధి అవకాశాలు!

- వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి
- నూతన కోర్సుల ఏర్పాటుతో మరిన్ని ఉద్యోగావకాశాలు
- ఆ దిశగా చర్యలు చేపట్టాలని వేడుకోలు

రాయదుర్గం: ప్రస్తుతం ఉపాధి ఆధారిత కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం, హైదరాబాద్ నాలెడ్జి సిటీ పరిసరాల్లోని కాలనీలు, బస్తీలలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ఉన్నత విద్యాసంస్థలలో మరిన్నింటిని ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. పది, ఇంటర్మీడియేట్ కోర్సులతో ఉపాధి ఇచ్చే కోర్సులకు బాగా డిమాండ్ ఉంది. ఈ కోర్సులు పూర్తి చేసిన యువతకు ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు పెరుగుతున్నాయి. గతం నుంచి వస్తున్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశాలు వస్తున్నా అందరికీ రావడం లేదనే అభిప్రాయం నెలకొంది. ముఖ్యంగా బీఈడీ, ఇతర కోర్సులు పూర్తి చేసినా ఉద్యోగాలు దొరకడం నేటి పోటీ ప్రపంచంలో గగనంగా మారింది చాలా మంది వయోపరిమితి పూర్తయి ఇబ్బందులు పడ్డ సంఘటనలు కూడా లేకపోలేదని పలువురు యువత వ్యాఖ్యానిస్తున్నారు. పది పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు వృత్తి విద్యాకోర్సుల్లో చేరుతున్న యువతకు తమ కోర్సులు పూర్తయి సర్టిఫికెట్లు చేతికి అందగానే ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా వృత్తి విద్యాకోర్సులు నిర్వహించే విద్యా సంస్థలు ఎంతో అవసరమని ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అందరూ అభిప్రాయపడుతున్నారు.

జాబ్ గ్యారెంటీ కోర్సులతో..

వంద శాతం జాబ్ గ్యారెంటీ కోర్సులతో రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ(జీఐఎల్‌టీ). కొనసాగుతోంది. ఈ ఇనిస్టిట్యూట్‌లో మూడేళ్ల కాలపరిమితితో కూడిన లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ అనేక రెండు పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులను నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితితో కూడిన ఒక్కో కోర్సులో 60 మంది చొప్పున రెండింటిలో కలిపి 120 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులలో చేరడానికి కనీస విద్యార్హత పది పాసై పాలిసెట్‌లో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.


'మనూ' ప్రధాన భవనం

'మనూ'లోనూ మంచి అవకాశాలు..

మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్యా విధానంలో డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించడమే కాకుండా, ఐటీఐ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడంతో ఎంతో మందికి విద్యా, ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. వీటిలో మరిన్ని కోర్సులు ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో మేలు చేకూరే అవకాశం లేకపోలేదు.రెండు పీజీ డిప్లొమో, పది డిప్లొమో కోర్సులు, ఏడు సర్టిఫికెట్ కోర్సులు,అడ్వాన్స్ డిప్లొమో కోర్సు ఒకటి నిర్వహిస్తున్నారు. ఇదిలా వుండగా 'మనూ' లో ఐటీఐ కేంద్రం ఉండడంతో అందులో రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ కోర్సులు ఉండగా ఏడాది కాలపరిమితితో కూడిన ప్లంబర్ కోర్సు కొనసాగుతోంది.

ప్రభుత్వ కళాశాలలో..

మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్టుకు చేరువలో ఉండడంతో కంప్యూటర్‌సైన్స్ ఒకేషనల్ కోర్సును నిర్వహించడం విశేషం. ఈ కళాశాలలో అంకితభావంతో పనిచేసే ఇద్దరు లెక్చరర్లను ఏర్పాటు చేయడంతో ఈ కోర్సుకు ప్రాధాన్యం ఏర్పడింది. మొదట్లో 15 మంది ఉండగా నేడు ఏటా వందకుపైగా శిక్షణ పొందుతున్నారుఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తుండడంతో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉండేందుకు అవకాశం కలుగుతోంది.

'నిథమ్'లోనూ అనేక కోర్సులు..

గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అనేక వృత్తి ఆధారిత కోర్సులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఫుడ్ తయారీ, ఆతిథ్య రంగాలకు చెందిన పలురకాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి స్వయం ఉపాధి పొందేలా యువత, మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఫుడ్, పర్యాటక, ఆతిథ్య రంగాల లో డిప్లొమో కోర్సులను కొనసాగిస్తున్నారు.

యువత, స్థానికుల డిమాండ్లు ఇవే..

- ఐటీకారిడార్, ఫైనాన్షియల్‌డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతానికి చేరువలోనే ఉండే కాలనీలు, బస్తీలలోని యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన కంప్యూటర్ సెంటర్లు, ఇతర డిప్లొమో కోర్సులు ఏర్పాటు చేయాలి.
- రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో స్వల్పకాలిక కోర్సులను మరిన్నింటిని ఏర్పాటు చేసేందుకు చేస్తున్న చర్యలు వేగవంతం చేసి యువతకు అందుబాటులోకి తేవాలి
- నిథమ్, ఇంజినీరింగ్‌స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కూడా మరిన్ని డిప్లొమో, స్వల్పకాలిక కోర్సులను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి.
- ఉన్నత విద్యాసంస్థల్లో మరిన్ని వృత్తి ఆధారిత కోర్సులను ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే మరింత మందికి ఉపాధి కల్పించి సొంతకాళ్లపై నిలబడేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు ఉన్నత విద్యా సంస్థలకు అవకాశం కల్పించాలి.



హెచ్‌సీయూలోనూ..



50 ఏళ్ల చరిత్ర గల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ పలు వృత్తివిద్యాకోర్సులను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ ఆధ్వర్యంలో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం యూజీసీ, ఏఐసీటీఈ,డీఈసీ జాయింట్ కమిటీ ఆమోదం పొందిన 14 వివిధ రకాల డిప్లొమో కోర్సులను ప్రతియేటా దూరవిద్యా వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్నారు ఇతర సంస్థలతో సంయుక్తంగా ఆరుమాసాల అప్‌స్కిల్లింగ్ కోర్సులను కూడా ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్: గాజులరామారం, శ్రీరాంనగర్ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ నగర్, శ్రీరాంనగర్, బేకరీ గడ్డ లైన్, భాస్కర్ బస్తీ, ఎస్‌సీబీ నగర్, రోడామేస్త్రీ నగర్, వల్లభాయి పటేల్ నగర్, ఎంఎఫ్ ఫంక్షన్ హాల్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు


ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి దేవి హోమ్స్‌లో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ ఎస్ఎంసీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, దేవి హోమ్స్ కమ్యూనిటీ సభ్యులు సందీప్ గౌడ్, ప్రకాష్ రెడ్డి, రాజ్ కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంరెడ్డి


ఎస్.రాంరెడ్డి


మురళి కృష్ణమూర్తి

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా బౌరంపేట జిల్లా పరిషత్ హెచ్ఎం ఎస్.రాంరెడ్డి విజయం సాధించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించారు. ఓటింగ్‌లో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా టి.మురళి కృష్ణమూర్తి(కొకూర్), కోశాధికారిగా భాగ్యమణి(కొల్తూరు), రాష్ట్ర కౌన్సిలర్లుగా డి. వేణు(శామిర్‌పేట్), ఎంవీవీ రామకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగనుంది. తమ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని రాంరెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న సర్వే


సర్వే వివరాలను తెలుసుకుంటున్న ఉప కమిషనర్ నర్సింహ

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఉప కమిషనర్ నర్సింహ సర్వేను ఆదివారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లను అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. నోడల్ అధికారి రఘు ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

కార్తీకమాసం వన భోజనాలు


కార్యక్రమంలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్

చింతల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వివిధ కుల సంఘాలు ఏర్పాటు చేసిన వన భోజనాల కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హెచ్ఎంటీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వీఎంఆర్ కాపు సేవా సమితి, గాజుల రామారం డివిజన్ యండమూరి లే అవుట్ కమిటీ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం, హెచ్ఎంటీ కాలనీ పోచమ్మ గుడి వద్ద శెట్టి బలిజ యువజన సంఘం ఏర్పాటు చేసిన కార్తీక వన భోజన మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.

22న దివ్యాంగులకు క్రీడా పోటీలు

సాక్షి,సిటీబ్యూరో: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో జూనియర్ విభాగం (10 నుంచి 17 ఏళ్లు), సీనియర్ విభాగం (18 నుంచి 54 ఏళ్లు) వయస్సు ఉన్న దివ్యాంగులకు ఈనెల 22న నేరేడ్‌మెట్‌లోని రామకృష్ణపురం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు ఈనెల 21 ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆటల పోటీల్లో భాగంగా చెస్, ట్రైసైకిల్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

కేపీహెచ్‌బీకాలనీ: మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాదాపూర్ చంద్రనాయక్ నగర్‌కు చెందిన యెండ ప్రదీప్ (25) శనివారం ఉదయం 9:30 గంటలకు తన విధుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి అర్థరాత్రి సుమారు 3 గంటల తరువాత కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ ఇందు ఫార్చ్యూన్ అపార్టుమెంట్స్ సమీపంలో మితిమీరిన వేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో తలకు, ఛాతీకి, మొహానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ప్రదీప్ సోదరుడు శంకర్‌రావు విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు దోహదం


బహుమతులతో గెలుపొందిన చిన్నారులు, యాజమాన్యం

జీడిమెట్ల: చిన్నారులు పోటీల్లో పాల్గొన్నప్పుడే వారి ప్రతిభ బయటపడుతుందని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ తానిపర్తి కోటిరెడ్డి అన్నారు. అపురూపా కాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్‌లో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆటల పోటీలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమానికి కోటిరెడ్డితో పాటు పెంచాల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీవీఆర్ గ్రూప్స్‌కు చెందిన 7 పాఠశాలల 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 1680 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, ఎలక్యూషన్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ వంశీరెడ్డి, టీవీఆర్ చింతల్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఇందిరమ్మ కాలనీ అసోసియేషన్


కొలన్ నీలారెడ్డిని సన్మానిస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

నిజాంపేట్: స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేటలోని 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3 నూతన కమిటీ సభ్యులు మేయర్‌తో పాటు కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సీహెచ్ మహేష్, వైస్ ప్రెసిడెంట్ జి.కృష్ణ, జనరల్ సెక్రటరీ కె.మల్లేశం, జాయింట్ సెక్రటరీ పి.కవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.బాలయ్య, ట్రెజరర్ కె.లలిత తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


ఓటు నమోదు చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంకల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్ సగర అన్నారు. సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ 12, 13వ వార్డుల పరిధిలోని పలు అపార్టుమెంట్లలో ఓటరు అవగాహన, నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 100 మందికి పైగా నూతనంగా ఓటరు నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేత శివాజీ రాజు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వచ్చే జనవరి వరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాస్కేడ్ గ్రీన్ గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి ఆత్మబంధు, కోశాధికారి రాధాకృష్ణ, సంకల్ప్ ఫౌండేషన్ కోశాధికారి ఉప్పరి మహేందర్, సభ్యులు రాజేష్, విశాల్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

19న వైద్యారోగ్య శాఖ అభ్యర్థులకు కౌన్సెలింగ్

డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల19 న ఉదయం 10.30 గంటలకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సర్టిఫికేట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డా. రఘునాథ్‌స్వామి ప్రకటించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, స్థానికతకు సంబంధించిన ధృవపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్ అని అనుమానం వస్తే 9440446106, టోల్ ఫ్రీ నంబర్ 1064 ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ లోని బ్లూ వేవ్స్ స్విమ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిన్ స్విమ్మింగ్ స్టేట్ ఫెడరేషన్ కప్ చాంపియన్ షిప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీపడాలన్నారు. కార్యక్రమంలో నిజాంపేట డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, ఫిన్ స్విమ్మింగ్ జనరల్ సెక్రటరీ దినేష్ రాజారియా, బ్లూ వేవ్స్ స్విమ్ అకాడమీ డైరెక్టర్ విజయ్, పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, నాయకులు నాచారం మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలను అడ్డుకోవాలి



సమావేశంలో పాల్గొన్న విజయదుర్గ ప్లాట్స్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: బాచుపల్లి మండల పరిధిలోని సర్వే నెంబర్ 51, 52లో గల విజయదుర్గ నగర్ కాలనీలో రోడ్డు ఆక్రమణలను అడ్డుకోవాలని ఆ కాలనీ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులను కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నెంబర్ 48, 49కు చెందిన కొందరు బిల్డర్లు పక్క వెంచర్ కోసం తమకు సంబంధించిన స్థలం నుంచి రాత్రివేళ రోడ్డును చదును చేస్తున్నారని ఆరోపించారు. సుమారు 30 ఏళ్ల క్రితం నాడే తాము ఇక్కడ ప్లాట్లు వ్యాలిడ్ సేల్‌డీడీ ప్రకారం కొనుగోలు చేశామన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు ఇది అసైన్డ్ ల్యాండ్ అని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని, దీంతో తాము కోర్టును ఆశ్రయిస్తే స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చిందన్నారు. 1997, 98 పహనీలో వెండర్ శ్రీ లక్ష్మీహౌజింగ్ ఎంటర్ ప్రైజెస్ పేరు రెవెన్యూ రికార్డుల్లో మ్యూటేషన్ చేయబడిందని, కాలమ్ 16 లో ఇవి ఇళ్ల ప్లాట్లుగా చూపించబడిందని వివరించారు. అప్పటి రికార్డుల ప్రకారం ఇది ప్రైవేట్ భూమి అని, పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తామందరం నమ్మి కొనుగోలు చేశామన్నారు. రాత్రిపూట తవ్వకాలు జరిగే క్రమంలో అడిగిన వారిని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన అన్ని రకాల హక్కులను రెవెన్యూ అధికారులు తమకు కల్పించాలని కోరారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున సదరు స్థలాల్లో ఎలాంటి పనులు జరుగకుండా నిలిపివేయాలని కోరారు.

'మెడివిజన్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడివిజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో స్థానికులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, నాయకులు మేకల ఎల్లయ్య, మీసాల సత్యనారాయణ, తిమ్మయ్య, మణికంఠ, వైద్యులు డాక్టర్ ప్రేమ్, సంజయ్ ఆసుపత్రి సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: స్వరాష్ట్ర ఉద్యమ అమరవీరుల కుటుంబాలను గుర్తించి, వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ చైర్మన్ వాసుయాదవ్, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్ ఆధ్వర్యంలో మల్లికార్జు నగర్‌లోని ఎస్.ఎస్ ఆర్ బంకిట్ హాల్‌లో ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్ర ఏర్పాటుకు కేసీఆర్ నాయకత్వంలో వివిధ రూపాల్లో పోరాటాలు జరిగాయన్నారు. ఉద్యమకారులను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఖాదీర్, ప్రభుకుమార్ గుప్తా, శశికళ, మక్కాల సత్యనారాయణ, మట్టి శ్రీను, మేకల హరినాథ్, నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్ రావు, సయ్యద్ ఏజాజ్, రాజు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందాల బల్దేవ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ గుండు దయానంద్, రాంబాబు, జగన్‌యాదవ్, కంటోన్మెంట్ ఇన్‌చార్జి ప్రభుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

గ్యార్వీ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో మైనార్టీ సీనియర్ నాయకుడు సమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ వేడుకలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.